సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 40 రోజులకు రూ.11,99,209 ఆదాయం లభించింది.



భూ సర్వేపై శిక్షణ

భీమవరం(ప్రకాశం చౌక్): జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష సర్వేపై భీమవరం మున్సిపాల్టీలో కమిషనర్ ఎస్.శివరామకృష్ణ పర్యవేక్షణలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు



తాడేపల్లిగూడెం రూరల్: కొండ్రుప్రోలులోని శివాలయంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు.

న్యూస్‌రీల్

పోలవరంలో కొనసాగుతున్న వైద్యశిబిరం



పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో వైద్య శిబిరం

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో అస్వస్థతకు గురైన కార్మికుల కోసం ఏర్పాటుచేసిన వైద్యశిబిరం మూడో రోజైన సోమవారం కూడా కొనసాగింది. వింజరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మురళీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 11 మంది కార్మికులు చికిత్స నిమిత్తం వచ్చారని, వారందరికీ చికిత్స అందించి, అవసరమైన మందులను అందించామని ఆయన చెప్పారు. శనివారం నాటి ఘటనకు సంబంధించి ఆరోగ్య సమస్యలతో చికిత్స నిమిత్తం ఎవరూ వైద్యశిబిరానికి రాలేదన్నారు.

బలివే తీర్థానికి తమ్మిలేరు నీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న దృశ్యం

చింతలపూడి : మహా శివరాత్రి పండగను పురస్కరించుకుని బలివే తీర్థానికి తమ్మిలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేసినట్టు తమ్మిలేరు ఇరిగేషన్ డీఈ బి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతానికి 50 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుంచి విడుదల చేశామని చెప్పారు. దాదాపు 40 కిలోమీటర్లు ప్రధాన కాల్వ ద్వారా ప్రయాణించి నడిపల్లి చెరువులోకి ఈ నీరు చేరుతుందని ఆయన తెలిపారు. అక్కడి నుంచి బలివేకు భక్తుల కోసం నీటిని వంతుల వారీగా తరలిస్తామని చెప్పారు. బలివేకు వచ్చే భక్తులకు ఎలాంటి నీటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 18వ తేదీన మహాశివరాత్రి నాటికి 150 క్యూసెక్కుల నీరు భక్తులకు అందుబాటులో ఉండే విధంగా నీరు విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి



ప్రజలకు వివరిస్తున్న జాతీయ విపత్తుల నిర్వహణ అధికారులు

యలమంచిలి: వరదలు, తుఫాన్‌లు, అగ్నిప్రమాదాలు, భూకంపం వంటి ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ (విజయవాడ) సత్యనారాయణ కోరారు. విపత్తుల సమయంలో మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు ఇతరులను కూడా ఏ విధంగా రక్షించాలో వివరిస్తూ సోమవారం పెదలంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ విపత్తుల నిర్వహణ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా ప్రదర్శన నిర్వహించారు. పెదలంక గ్రామాన్ని ప్రతి ఏడాదీ వరదలు ముంచెత్తుతాయని, ఆ సమయంలో ఏ విధంగా రక్షించుకోవాలో తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

స్కిల్ కాలేజీలో శిక్షణకు నేడు, రేపు ఎంపికలు

ఏలూరు (టూటౌన్): ఏలూరులో డీఆర్‌డీఏ, డీడీయూజీకేవై ఆధ్వర్యంలో స్కిల్ కాలేజీని త్వరలో ప్రారంభించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో సీనియర్ బ్యూటీ థెరపిస్ట్ ఆరు నెలల రెసిడెన్షియల్ కోర్సు అందించనున్నట్టు వివరించారు. వట్లూరు టీటీడీసీలో శిక్షణను త్వరలో ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ఈ కోర్సు నేర్చుకోవాలనుకునే వారు 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, పదో తరగతి విద్యార్హత అవసరమని వివరించారు. ఈ నెల 14, 15 తేదీల్లో స్థానిక టీటీడీసీలో నిర్వహించే ఎంపిక కార్యక్రమానికి ఆసక్తి ఉన్న యువతులు నేరుగా ఎంపిక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా పీడీ విజయరాజు కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 93928 19393 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

మహిళా శక్తికి మార్ట్

లక్షణంగా వ్యాపారం

- మహిళా మార్ట్‌లతో ఆర్థిక స్వావలంబన
- రాష్ట్రంలోనే అధిక విక్రయాలు చేసే మార్ట్‌గా చింతలపూడి
- జిల్లాలో రెండు మార్ట్‌ల ఏర్పాటు
- త్వరలో మరో నాలుగు చోట్ల..

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రతి మహిళా.. మహిళా మార్ట్ ఓనరే.. పొదుపు సంఘాల్లో రూపాయి రూపాయి దాచుకుని డ్వాక్రా సంఘాలను నిర్వహిస్తున్న సభ్యుల సమన్వయంతో చేయూత మహిళా మార్ట్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలకు ఆర్థికంగా మరింత చేయూతనందించే లక్ష్యంతో, ప్రతి మహిళను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో వీటికి ప్రారంభిస్తున్నారు. ఇతర జిల్లాల కంటే భిన్నంగా ఏలూరు జిల్లాలో రెండు మార్ట్‌లు ప్రారంభమయ్యాయి. వీటిలో చింతలపూడి మార్ట్ రోజుకు సగటున లక్ష రూపాయల వరకు విక్రయాలతో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది.

వ్యాపారాల్లో ప్రోత్సహించేలా..

పొదుపు సంఘాల మహిళలను వ్యాపారాల్లో ప్రోత్సహించాలని ప్రభుత్వం దృఢసంకల్పంతో ముందుకు వెళుతోంది. పాడి ఉత్పత్తులు మొదలు చిన్నస్థాయి కుటీర పరిశ్రమల వరకు ఎక్కువగా మహిళలే ఓనర్లుగా, వారి భాగస్వామ్యం ఉండేలా ప్రోత్సహిస్తోంది. తాజాగా చేయూత మహిళా మార్ట్‌కు శ్రీకారం చుట్టి మహిళలతో ప్రతి నియోజకవర్గంలో ఒక సూపర్‌బజార్‌ను చేయూత మహిళా మార్ట్ పేరుతో ప్రారంభిస్తున్నారు. రానున్న రోజుల్లో ప్రతి పట్టణం, మండల కేంద్రాల్లో మార్ట్‌లు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ప్రయోగాత్మకంగా ప్రారంభించిన మహిళా మార్ట్‌లు జిల్లాలో సూపర్ సక్సెస్ కావడంతో యుద్ధప్రాతిపదికన మిగిలిన మున్సిపాల్టీల్లో ప్రారంభించడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నారు.

మార్ట్‌కు శ్రీకారం ఇలా..

ఏలూరు జిల్లాలో 48,012 గ్రూపులు, వీటి పరిధిలో 4,93,387 మంది సభ్యులున్నారు. గ్రామీణాభివృద్ధి పరిధిలో 43,765 గ్రూపులు, సభ్యులు 4,50,521 మంది, మెప్మా పరిధిలో (పట్టణ) 4,247 గ్రూపులు, సభ్యులు 42,866 మంది ఉన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల్లో ఇప్పటివరకు 17 మహిళా మార్ట్‌లు ప్రారంభమయ్యాయి. వీటిలో ఏలూరు జిల్లాలో ఈనెల 4న చింతలపూడి, గతేడాది అక్టోబర్ 28న జంగారెడ్డిగూడెంలో చేయూత మార్ట్‌లను ప్రారంభించారు.

భాగస్వామ్యం ఇలా..

ఏ మండల లేదా మున్సిపాల్టీలో ఏర్పాటుచేసే మార్ట్‌లో ఆయా పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలు భాగస్వాములవుతారు. జంగారెడ్డిగూడెం పరిధిలో ఒక్కొక్కరి నుంచి రూ.245 (షేర్ ధర రూ.220 + దరఖాస్తు రుసుం రూ.25) తీసుకుని మహిళల భాగస్వామ్యంలో ఆయా సంఘాలకు మార్ట్ బాధ్యత అప్పగించారు. ప్రస్తుతం చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో ఏర్పాటుచేసిన మార్ట్‌లు విజయవంతమయ్యాయి. చింతలపూడి మార్ట్‌లో రోజుకు సగటున రూ.97,417లు విక్రయాలు జరుగుతున్నాయి. ఈనెల 4న ప్రారంభమైన చింతలపూడి మార్ట్ ఇప్పటివరకు రూ.10 లక్షల విక్రయాలు పూర్తిచేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ షాపు నిర్వహణ నుంచి సేల్స్‌మేన్ల వరకు అందరూ డ్వాక్రా మహిళలు కావడం విశేషం. త్వరలో భీమడోలు, నూజివీడు, కైకలూరు, ఏలూరులో మార్ట్‌ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



చింతలపూడిలో చేయూత మహిళ మార్ట్



మార్ట్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మార్ట్	సంఘాలు	సభ్యులు	మూలనిధి (రూ.లలో)
చింతలపూడి	2,374	24,948	45,13,164
జంగారెడ్డిగూడెం	1,593	15,898	40,01,800

మహిళలకు ఎంతో మేలు



మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మహిళా మార్ట్‌లు దోహదపడతాయి. జిల్లాలోని మహిళా మార్ట్‌ల ద్వారా మహిళలు లాభాలు గడిస్తున్నారు. త్వరలో ఏలూరు, భీమడోలు, నూజివీడు, కైకలూరులలో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మహిళల సహకారం బాగుంది.

– కె.విజయరాజు, పీడీ, డీఆర్‌డీఏ

ఆదరణ బాగుంది



మహిళా మార్ట్‌కు ఆదరణ బాగుంది. మహిళా గ్రూపులకు చెందిన సభ్యులే కాకుండా బయటి నుంచి కూడా కొనుగోలుదారులు వస్తున్నారు. నాణ్యమైన సరుకులతో పాటు, తక్కువ లాభంతోనే సరుకులు విక్రయిస్తున్నాం. ప్రభుత్వ సహకారం మరువలేం. మహిళల అభ్యున్నతికి చేయూత మార్ట్‌లు ఎంతగానో దోహదపడుతున్నాయి.

– తొమ్మాంద్రు లక్ష్మి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

ఆర్థికంగా ఎదిగేలా..



మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేం. 2400 సంఘాలకు చెందిన 25 వేల మంది సభ్యుల మూలధనంతో మార్ట్‌ను ప్రారంభించాం. సభ్యుల ఆదరణతో రోజుకు లక్ష రూపాయల అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం మరింత సహకారం అందిస్తే వ్యాపారాన్ని విస్తరిస్తాం.

– తాడేపల్లి ప్రసూనా రాణి, మహిళా మార్ట్ నిర్వాహకురాలు

తణుకు విద్యుత్ శాఖలో చేతివాటం

విచారణకు ఉన్నతాధికారుల ఆదేశం



తణుకు విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయం

తణుకు : తణుకు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం పరిధిలో సిబ్బంది చేతివాటంపై ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. తణుకు డీ1 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఒక అసిస్టెంట్ లైన్‌మేన్‌తో పాటు వేల్పూరు సబ్‌స్టేషన్ పరిధిలో మరో లైన్‌మేన్ వ్యవహార శైలిపై ఇటీవలి కాలంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి పనికీ ఒక రేటు నిర్ణయించి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు అపార్ట్‌మెంట్లకు ట్రాన్స్‌ఫార్మర్ విషయంలో ఒక్కో కిలోవాట్‌కు రూ.1500 చొప్పున వసూలు చేస్తున్నట్టు సమాచారం. గృహ వినియోగంతో పాటు వాణిజ్య వినియోగదారుల నుంచి రెండు రెట్లు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. తణుకు మండలం వేల్పూరు సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త కనెక్షన్ మంజూరు కోసం ఇద్దరు వినియోగదారుల వద్ద రూ.8 వేలు, రూ.5 వేలు చొప్పున వసూలు చేసినట్టుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఇటీవల విజిలెన్స్ అధికారులు సైతం తనిఖీలు నిర్వహించారు. తాజాగా తణుకు సబ్ డివిజన్ డీఈఈ రామకృష్ణను విచారణ అధికారిగా నియమించినట్టు తాడేపల్లిగూడెం డీఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించినట్టు చెప్పారు. మరోవైపు అదే సబ్‌డివిజన్ పరిధిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై విచారణ అధికారిగా అక్కడి డీఈఈనే నియమించడం ఏమిటని కిందిస్థాయి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

దొంగ నోట్ల కేసులో పురోగతి

- నలుగురు నిందితుల అరెస్ట్
- కేసులో లోతైన దర్యాప్తు





వివరాలు వెల్లడిస్తున్న నరసాపురం డీఎస్పీ మనోహరాచారి, స్వాధీనం చేసుకున్న కారు

నరసాపురం: నరసాపురంలో కలకలం రేపిన యాక్సిస్ బ్యాంకు దొంగనోట్ల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. కేసులో సంబంధం ఉన్న నలుగురిని అరెస్ట్ చేశారు. అందులో ఒక మహిళ కూడా ఉండటం విశేషం. కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కె.రవిమరోహరాచారి వివరించారు. వివరాలిలా ఉన్నాయి.. నరసాపురం ఎన్టీఆర్ కాలనీకి చెందిన వీఆర్వో ముత్యాలపల్లి పెద్దిరాజు కుమారుడు కళ్యాణ్‌బాబు ఈనెల 2న పట్టణంలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎం మెషీన్‌లో రూ.40 వేలు డిపాజిట్ చేశాడు. వాటిలో రూ.500 నోట్లు 40 దొంగనోట్లు ఉంచినట్టుగా బ్యాంకు అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసును దర్యాప్తు చేసినట్టు డీఎస్పీ చెప్పారు. వీఆర్వో పెద్దిరాజు, అతని కుమారుడు కళ్యాణ్‌బాబుతో పాటు పట్టణంలోని నందమూరి కాలనీకి చెందిన పడుచూరి భాస్కరరావు, అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం రాజన్నపేటకు చెందిన తేలు పుష్పాంజలిని సోమవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ వెనుక మత్స్యపురి రోడ్డులో అరెస్ట్ చేశామన్నారు. అప్పులు పాలైన వీఆర్వో పెద్దిరాజు సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశతో మిత్రుడైన పడుచూరి భాస్కరరావుతో కలిసి ఈ వ్యవహారం నడిపినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. కేసును లోతైన దర్యాప్తు చేస్తున్నామన్నారు. రాజమండ్రి, విజయవాడ కేంద్రాలుగా దొంగనోట్లు మార్చే వారితో భాస్కరరావుకు ఉన్న పరిచయాలతో వ్యవహారం సాగించినట్టు చెప్పారు. ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.50 వేల దొంగ నోట్లు తీసుకుని వివిధ బ్యాంకు ఏటీఎంల్లో డిపాజిట్ చేశారన్నారు. నిందితుల వద్ద దొరికిన నకిలీ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి, ఇంకా దీని వెనుక ఎవరెవరి హస్తం ఉందనే దానిపై విస్తృత దర్యాప్తు చేస్తున్నామన్నారు. మూల సూత్రధారులను కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితుల వద్ద నుంచి కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నరసాపురం సీఐ జి.శ్రీనివాస్‌యాదవ్, టౌన్ ఎస్సై కె.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీల పరిష్కారం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనలో అందిన ప్రతి అర్జీనీ నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, అర్జీదారులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందనలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినతుల పరిష్కారం అర్జీదారులకు ఆనందం కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులు రోజూ స్పందనపై పది నిమిషాల సమయం కేటాయిస్తే ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారమవుతాయన్నారు. స్పందన కార్యక్రమంలో 196 దరఖాస్తులు స్వీకరించినట్టు చెప్పారు.

అర్జీల్లో కొన్ని..

- వీరవాసరంలోని శ్రీమహాలక్ష్మి డ్వాక్రా సంఘానికి సంబంధించిన రుణం, పొదుపు చెల్లించే ఓ సభ్యురాలు రూ.4 లక్షలు బ్యాంకుకు చెల్లించకుండా మోసం చేసిందని మిగిలిన గ్రూపు సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- ప్రభుత్వం తమకు ఇచ్చిన రెండెకరాల భూమి తన తండ్రి నుంచి సంక్రమించిందని, దానిని కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారని చర్యలు తీసుకోవాలని ఆచంట మండలం అయోధ్యలంకకు చెందిన పి.వెంకట్రియ్య కోరారు.
- తనకు రేషన్ కార్డు ఇప్పించాలని భీమవరం మండలం రామాయణపురానికి చెందిన ఎం.సువర్ణ దరఖాస్తు అందించారు. జాయింట్ కలెక్టర్ జేవీ మురళి, ఆర్డీఓ కె.కృష్ణవేణి, డీపీఓ ఎం.నాగల, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం పోస్టర్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం నుంచి ఈనెల 17 వరకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆర్థిక అవసరాలపై అవగాహన కల్పించడం, బ్యాంకు కాంటాక్ట్ నంబర్లు, డెబిట్ క్రెడిట్ కార్డుల గురించి, ఓటీపీ సీవీసీ, పాస్‌వర్డ్, పిన్, బ్యాంకు ఖాతాలు తదితర వివరాలను ఎవరితో పంచుకోవద్దని సూచించారు. డిజిటల్ బ్యాంకు సేవలు సురక్షితమని, అయితే సైబర్ నేరాల బారిన పడవద్దన్నారు. సురక్షితమైన ఆర్థిక వ్యవస్థ ముఖ్యమన్నారు. రుణం తీసుకునే ముందు అన్ని వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఫోన్‌లో వివరాలు ఇతరులకు యాక్సెస్ చేసే ముందు జాగ్రత్తగా ఉండాలన్నారు. జేసీ జేవీ మురళి, డీఆర్వో కె.కృష్ణవేణి, ఎల్‌డీఎం రమణ, డీపీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, భీమవరం డీఎస్పీ వి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

సత్వర విచారణే లక్ష్యంగా..



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం: ఫిర్యాదులపై సత్వర విచారణే లక్ష్యంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లా ఏఎస్పీ (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు అన్నారు. భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో 16 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. వరకట్న వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్ వివాదాలపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. అర్జీల్లో కొన్ని..

- గతనెలలో తన ఇంట్లో చోరీ జరిగిందని, వేగంగా దర్యాప్తు చేయాలని పోడూరు మండలానికి చెందిన ఓ మహిళ కోరారు.
- తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి రూ.8 లక్షలు తీసుకుని మోసం చేశాడని భీమవరం పట్టణానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.
- తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని పెంటపాడుకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

ఆయా కేసులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఏఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరగాళ్ల మోసాలు పెరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రూ.16.41 లక్షల విలువైన ఔషధాల జప్తు

ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెల్లడి

ఏలూరు(మెట్రో) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లో లైసెన్సులు లేకుండా మందుల కొనుగోలు, నిల్వలు, అమ్మకాలు జరుపుతున్న ఔషధ దుకాణాలపై కేసులు నమోదు చేసి రూ.16.41 లక్షల విలువైన ఔషధాలను జప్తు చేసినట్టు ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.పాండురంగ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రగ్స్ – కాపీ రైట్స్ ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, భీమవరం, ఏలూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ల పరిధిలోని ఔషధ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. తణుకులో మూడు దుకాణాలు, భీమవరం, ఏలూరులలో రెండు దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా, లైసెన్సులు లేకుండా మందుల కొనుగోలు, నిల్వలు, అమ్మకాలు నిర్వహిస్తున్న షాపులను గుర్తించినట్టు వెల్లడించారు. ఆయా దుకాణాల్లో రూ.16.41 లక్షల విలువైన ఔషధాలను సీజ్ చేసినట్టు తెలిపారు. వీటిలో మత్తు కలిగించే మందులు, గర్భ విచ్ఛిత్తికి వినియోగించే మందులు ఉన్నాయని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన దుకాణదారులపై కేసులు నమోదు చేశామని, వీటిపై దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. మందుల కొనుగోలు, నిల్వ, అమ్మకాలకు డ్రగ్ లైసెన్స్ అవసరమని, ఔషధాలను ప్రిస్క్రిప్షన్ పైనే అమ్మకాలు జరపాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాండురంగ ప్రసాద్ హెచ్చరించారు. నిషేధిత ఔషధాల విక్రయాలపై గట్టి నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

పంట నమోదు త్వరగా పూర్తిచేయాలి



పంటనమోదు పక్రియను పరిశీలిస్తున్న జేడీఏ తాళ్లూరి శ్రీధర్

నరసాపురం రూరల్: పంట నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని వ్యవసాయ సంయుక్త సంచాలకుడు (జేడీఏ) తాళ్లూరి శ్రీధర్ అన్నారు. సోమవారం నరసాపురం మండలం కె.బేతపూడి గ్రామంలో పంట నమోదు చేసిన రైతుల వివరాలను ఆయన పరిశీలించారు. ఈ క్రాప్ నమోదు పరిశీలనలో భాగంగా రైతు పేరు, విస్తీర్ణం, సాగు వివరం, పంట నమోదు చేసిన తేదీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట నమోదు చేయించుకోవడం ద్వారా పంట విస్తీర్ణం, సాగు వివరం తెలియడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పరిహారం పొందేందుకు, సాగు చేసిన పంటను ఒబ్బిడి చేసి సొమ్ము చేసుకునేందుకు కూడా దోహదపడుతుందన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. వరి సాగులో జింక్ లోపం (ఇటుక రాయి రంగులో తుప్పు మచ్చలు) కనిపిస్తోందని చెప్పారు. ఏడీఏలు కేపీఎస్ఎస్ శ్రీనివాస్, ఈదా అనిల్‌కుమారి ఉన్నారు.

క్లుప్తంగా

గొడ్డలితో వ్యక్తిపై దాడి



తీవ్రంగా గాయపడిన కారం రాముడు

కుకునూరు: మతి స్థిమితం లేని వ్యక్తి దాడి చేయడంతో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం మధ్యాహ్నం మండలంలోని గుండుగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గుండుగూడెం గ్రామానికి చెందిన సోడె రాముడికి మతి స్థిమితం లేదు. ఇటీవల అతని ఇల్లు అగ్నిప్రమాదంలో కాలిపోయింది. గుడిసె వేసేందుకు గ్రామంలోని మరికొంతమందితో కారం రాముడు (40) కూడా వచ్చాడు. అందరూ మధ్యాహ్న సమయంలో భోజనానికి వెళ్లగా, వెంటనే భోజనం చేసి వచ్చిన కారం రాముడు, సోడె రాముడు ఇంటి ఎదురుగా ఉన్న చెట్టు కింద సేదతీరాడు. గొడ్డలితో వచ్చిన సోడె రాముడు కారం రాముడిపై దాడి చేసి గాయపర్చాడు. ఈ దాడిలో కారం రాముడు నుదురు, తలపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుకునూరు పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించారు.

శివరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం

క్షీరారామంలో పూర్తయిన ఏర్పాట్లు



ఆలయ ప్రాకారం (ఫైల్)



క్షీరారామలింగేశ్వరస్వామి



పార్వతీ దేవి

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా విలసిల్లుతున్న పాలకొల్లు శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం అతి ప్రధాన శైవక్షేత్రం. కుమారస్వామి తన శక్తి ఆయుధంతో తారకాసురుడి కంఠంలోని అమృతలింగాన్ని ఛేధించగా ఐదు భాగాలుగా పడింది. ఈ ఐదు భాగాలలో ఒకటి పశ్చిమ గోదావరి జిల్లా క్షీరారామం పడగా క్షీరారామలింగేశ్వరస్వామిగా విష్ణుమూర్తి ప్రతిష్ఠ చేశారు. ఇక్కడ స్వామివారు పార్వతీ సమేతుడిగా దర్శనమిస్తారు. ఈ క్షేత్రంలో అమృతలింగ శిరోభాగాన్ని త్రేతాయుగంలో శ్రీరాముడు పునః ప్రతిష్ఠించాడని పురాణాలు చెపుతున్నాయి. శివుని కోరికపై ఇక్కడ మహావిష్ణువు లక్ష్మీసమేతుడై క్షేత్రపాలకుడిగా కొలువై ఉన్నాడు.

కొప్పేశ్వరుడు

స్థలపురాణంలో ఇక్కడి శివలింగం మొనతేలి శివుని కొప్పు భాగాన్ని సూచిస్తుంది. ఇది అమృతలింగం శిరోభాగమని చెప్పడంతో పాటు శాసనాల్లో స్వామిని కొప్పేశ్వరుడిగా పేర్కొన్నారు. ఈ శివలింగంపై ఉన్న నొక్కులు కుమారస్వామి అమృత లింగాన్ని ఛేదించిన సమయంలో తగిలిన బాణపు దెబ్బలని భక్తుల విశ్వాసం. శైవక్షేత్రాల్లో శ్రీశైలం తరువాత మహాశివరాత్రి నాడు లింగోద్భవ సమయంలో పాగా కట్టే సంప్రదాయాన్ని ఈ క్షీరారామలింగేశ్వరస్వామి క్షేత్రంలో కొనసాగిస్తుంటారు. ఇక్కడ శివలింగం తెల్లగా పాలవర్ణంలో 2.5 అడుగుల ఎత్తున ఉంటుంది. ప్రతీ సంవత్సరం ఉత్తరాయణ, దక్షిణాయన కాలాల్లో సూర్యోదయం సమయంలో గాలిగోపురం రెండో అంతస్తు నుంచి శివలింగంపై సూర్యకిరణాలు తాకడం విశేషం. స్వామి సన్నిధిలో ఒకరోజు నిద్రిస్తే లభించే పుణ్యం వారణాసిలో ఏడాది ఉంటే కలిగే పుణ్యంతో సమానమని ప్రతీతి. ఆలయంలో సరస్వతీదేవి, మహిషాసురమర్దని, గోకర్ణేశ్వరస్వామి, వినాయకుడు, శనీశ్వరుడు, కాశీ విశ్వేశ్వరుడు, నగరేశ్వరుడు, కుమారస్వామి, వీరభద్రుడు, కాలభైరవుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పంచముఖ లక్ష్మీగణపతి, బ్రహ్మ, ఆంజనేయస్వామి ఉపాలయాల్లో కొలువై ఉన్నారు. ఈ ఆలయం పంచాయతన ఆలయంగా ప్రసిద్ధి. ఆలయంలో స్వామిని దర్శించుకోవడానికి గాలిగోపురం నుంచి ఐదు ద్వారాలు ఉంటాయి, ఐదు నందులు, ఐదు గణపతులు, వరుసగా ఐదు ఆలయ శిఖరాలు, ఐదుగురు అమ్మవార్లు, ఐదు మండపాలు, ఐదు శివలింగాలు దర్శనమిస్తాయి. స్వామివారి గర్భాలయం 11 ద్వారాలతో ఉంటుంది.

120 అడుగుల గాలిగోపురం

ఆలయ ముఖ ద్వారంలో 120 అడుగుల ఎత్తున తొమ్మిది అంతస్తులతో గాలిగోపురం ఉంటుంది. గోపురంపైన ఉన్న శిఖరాలను దర్శించుకోవడానికి లోపల మెట్ల మార్గం ఉంది. ఈ గాలిగోపురంపై ప్రాచీన శిల్పకళా వైభవంతో కనుల విందుగా ఆకర్షితంగా ఉంటుంది.

ఆలయంలో పూజలు, ఉత్సవాలు

స్వామివారికి ప్రతి సోమవారం రాత్రి 7.30 గంటలకు పంచహారతులు ఇస్తుంటారు. ప్రతీ నెలా మాస శివరాత్రి రోజున లీలాకళ్యాణం, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు 108 బంగారు పుష్పాలతో అష్టోత్తర పూజలు, లక్షముత్యాల పూజ, ప్రతీ సోమవారం గోపూజ, ప్రతీ పౌర్ణమి నాడు చండీహోమం నిర్వహిస్తుంటారు. భక్తుల సహకారంతో ప్రతీ సోమవారం అన్నదానం ఏర్పాటుచేసేవారు. గత కార్తీకమాసం నుంచి ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభించారు.

రేపటి నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 19 వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలంకరణలు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామివారి దర్శనం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు ప్రారంభిస్తారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అభిషేకాలకు రుసుం రూ.100గా నిర్ణయించారు. రాత్రి 8.35 గంటలకు జ్యోతి వెలిగిస్తారు. రాత్రి 12గంటలకు లింగోద్భవ సమయంలో దగ్గులూరు వరదా సోమేశ్వరరావు నేసిన మల్లన్న పాగాను స్వామివారికి అలంకరించనున్నారు. అనంతరం లక్షపత్రి పూజ నిర్వహిస్తారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి యార్ల సూర్యనారాయణలు ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: వ్యక్తి ఆత్మహత్య ఘటనలో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జె.భీమశేఖర్ తెలిపారు. స్థానిక బాలాజీ ఎన్‌క్లేవ్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గోవాడ రామకృష్ణ అదే అపార్ట్‌మెంట్‌లో ఒక గదిలో భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. ఈ నెల 6న రామకృష్ణ భార్య వెంకటలక్ష్మి పిల్లలను తీసుకుని పోతవరం ఫంక్షన్ కోసం వెళ్లింది. 13వ తేదీ ఉదయం అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ వెంకటలక్ష్మికి ఫోన్‌చేసి రామకృష్ణ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. వెంకటలక్ష్మి బంధువులతో వచ్చి చూడగా, రామకృష్ణ మృతిచెంది ఉన్నాడు.

విలేకర్లమంటూ బెదిరించారని ఫిర్యాదు

సాక్షి, భీమవరం: తన హోటల్ వ్యాపారంపై తప్పుడు ప్రచారం చేస్తామంటూ కొంతమంది తనను బెదించారని పట్టణానికి చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని తటవర్తి నాగ వెంకట సత్యనారాయణ గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను సోమవారం తెలిపారు. నర్సయ్యఅగ్రహారానికి చెందిన గుప్తా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద ఈ నెల 3న వెంకట్, మరికొంత మటన్ ఫ్రైడ్‌రైస్ బాగోలేదంటూ గొడవ చేశారని, విలేకర్లతో జాగ్రత్తగా ఉండకపోతే అధికారులను ఉసిగొల్పి తడాఖా చూపిస్తామంటూ బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేతా సత్యనారాయణ, ఆదినారాయణ రాజు, రాఘవ, వెంకట్, అయ్యప్ప, తాతారావుతోపాటు మరో ఇద్దరు యూట్యూబర్స్ ఒక్కొక్కరికి రూ. 20 వేలు చొప్పున ఇవ్వాలని ప్రతి నెలా రూ. 5 వేలు చొప్పున ఇవ్వాలని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీను చెప్పారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలుశిక్ష

పెదవేగి: మితిమీరి వేగంతో మోటారు సైకిల్‌ను ఢీ కొట్టి వ్యక్తి మృతికి కారణమైన కేసులో ఆర్టీసీ డ్రైవర్‌కు ఏలూరు కోర్ట్ రెండేళ్ల జైలు శిక్ష విధించింది. పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021 డిసెంబర్ 26న ఉదయం బొప్పన శివరాం, అతని కుమారుడు రాఘవ చౌదరి ముసునూరు మండలం గుడిపాడులో ఉన్న వారి పొలం వద్దకు వెళ్తున్నారు. రామచంద్రపురం గ్రామం కొఠారి గోదాం వద్దకు వచ్చేసరికి ఆర్టీసీ బస్సు డ్రైవర్ కె.వెంకటేశ్వరరావు వేగంగా వచ్చి మోటారు సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో రాఘవచౌదరి అక్కడికక్కడే మృతిచెందాడు. నేరం రుజువు కావడంతో ఏలూరు మొదటి అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డ్రైవర్‌కు 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు.

చేబ్రోలు రైల్వే గేటు మూసివేత

ఉంగుటూరు: చేబ్రోలు రైల్వే గేటును బుధవారం నుంచి మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం చెప్పారు. చేబ్రోలు నుంచి బాదంపూడి వరకు అత్యవసరంగా రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈ నెల 24వ తేదీ వరకు గేటు మూసివేస్తున్నట్లు తెలిపారు. 25వ తేదీ నుంచి గేటు తెరుస్తామని వివరించారు.

మన్యంలో వలసలపై పరిశోధన



సర్వే చేస్తున్న పరిశోధన బృందం

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో ఉంటున్న వలస కూలీల స్థితిగతులపై ప్రత్యేక పరిశోధన చేస్తున్నారు. ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో సుమారు 12 మంది పరిశోధక విద్యార్థులు వలస కూలీల స్థితిగతులపై ఈ పరిశోధన నిర్వహిస్తున్నారు. సుమారు నెలరోజుల పాటు కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన గ్రామాల్లో ఈ పరిశోధన చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజనుల వలసల నివారణతో పాటు ఉపాధి కల్పించే దిశగా ఈ అధ్యయనం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ఆంత్రోపాలజీ శాఖ ఆదేశాలతో పీడీ సత్యపాల్ కుమార్ పర్యవేక్షణలో సర్వే జరిగేలా శ్రీకారం చుట్టారు.

5 ఐటీడీఏల పరిధిలో పూర్తయిన సర్వే

ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల వలసలపై ఆంధ్రా యూనివర్శిటీ పరిశోధనా విద్యార్థులు చేపట్టిన సర్వే పార్వతీపురం, సీతంపేట, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించారు. ప్రస్తుతం పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ఇక్కడి పరిశోధన పూర్తయిన తర్వాత శ్రీశైలం గిరిజన ప్రాంతం, నెల్లూరు, యానాది తెగకు చెందిన వారి స్థితిగతులపై సర్వే చేస్తారు.

వలసల నివారణే లక్ష్యం

రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో వలస వెళ్ళిన గిరిజన కుటుంబాల వివరాలను ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన పరిశోధనా బృందం సేకరిస్తుంది. గ్రామాల్లో సర్వే చేస్తున్న సమయంలో ఎవరైనా వలస కూలీలు ఉంటే వారి వివరాలను సేకరించి నేషనల్ ట్రైబల్ మైగ్రేషన్ సపోర్ట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. వలస కూలీలు ఉంటే వారికి ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తామని పరిశోధనా విద్యార్థులు అంటున్నారు.

వలసల నివారణ, ఉపాధి కల్పనకు సర్వే



రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలోని గ్రామాల్లో గిరిజన వలస కూలీల వివరాలపై పరిశోధన చేస్తున్నాం. ఇప్పటికే శ్రీకాకుళం, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం, చింతూరు, ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో సర్వేలు పూర్తి చేశాం. ప్రస్తుతం కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో చేస్తున్నాం. తర్వాత నెల్లూరు, శ్రీశైలం గిరిజన ప్రాంతాల్లో కూడా సర్వే చేస్తాం. గిరిజనుల వలసల నివారణతో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా ఈ సర్వే జరుగుతుంది. ఆంధ్రా యూనివర్శిటీ, ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ పీడీ సత్యపాల్ కుమార్ పర్యవేక్షణలో ఈ సర్వే చేస్తున్నాం.

– డాక్టర్ సీఎస్ శ్రీనివాసరావు, ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్, పాడేరు

శ్రీవారి క్షేత్రంపై మంచు పరదా



శ్రీవారి క్షేత్రం

ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రాన్ని సోమవారం మంచు దుప్పటి కప్పేసింది. దాంతో ఆలయ పరిసరాలు రమణీయంగా మారాయి. క్షేత్రంలో ఉదయం 9 గంటల వరకు మంచు వీడలేదు. దాంతో వివిధ వాహనాలపై ఆలయానికి వచ్చిన భక్తులు రోడ్లు కనబడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు భక్తులు వాహనాల లైట్ల వెలుగుల్లో కొండ పైకి చేరుకున్నారు. మధ్యాహ్నం ఎండతీవ్రత అధికంగా ఉండటంతో భక్తులు అల్లాడిపోయారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను వద్ద జాతీయ రహదారి, ఇతర రహదారులపై పొగమంచు దట్టంగా కురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– ద్వారకాతిరుమల, భీమడోలు





భీమడోలు నుంచి రాజమండ్రి వెళ్లే రాష్ట్రీయ రహదారిపై దట్టంగా కమ్మేసిన మంచు, భీమడోలులో వరి క్షేత్రాలపై మంచు దుప్పటి

సకాలంలో పన్నులు చెల్లించాలి



పన్నులు బకాయి పడటంతో ఒక స్కూల్‌కు సీల్ వేస్తున్న మున్సిపల్ అధికారులు

జంగారెడ్డిగూడెం : సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ కమిషనర్ భవాని ప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో పెండింగ్ లో ఉన్న ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేసే చర్యలు కమిషనర్ భవాని ప్రసాద్ తన సిబ్బందితో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ లక్ష రూపాయల పైగా ఉన్న పన్నుల బకాయిదారులకు ఇప్పటికే నోటీసులు అంద జేశామన్నారు. మున్సిపాలిటీలో రూ. 9.50 కోట్ల బకాయిలకు 4.50 కోట్లు వసూలు చేశామని తెలిపారు. మొండి బకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశామని, స్పందించని బకాయిదారుల ఆస్తులను జప్తు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. జప్తు చేసిన వారం లోగా వారు సమస్యను పరిష్కరించుకోకపోతే వారి ఆస్తులను వేలం వేస్తామన్నారు. ఈ విధంగా సోమవారం రెండు స్కూళ్లలో ప్రిన్సిపాల్ కార్యాలయం, అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని సీజ్ చేశామని చెప్పారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి చెల్లించే ఆస్తి, కుళాయి, అడ్వర్టైజ్‌మెంట్ తదితర పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు దోహదపడుతాయని కావున ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలన్నారు.

వైద్యుడి తీరుపై ఆశాల నిరసన



ఆశాలకు క్షమాపణ చెబుతున్న డాక్టర్ గులాబ్ రాజకుమార్

కాళ్ల: ఆశాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మానసికంగా వేధిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి పనితీరుపై మండలంలోని ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోచమ్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి కాళ్ల తహసిల్దార్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. సెలవు అడిగితే డబ్బులు వసూలు చేస్తున్నారని వాపోయారు. గంటల తరబడి నిలబెట్టి ప్రశ్నలతో వేధిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. సమయం సందర్భం లేకుండా వీడియో కాల్స్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవు కోసం వడ్డీకి తెచ్చి డబ్బులిచ్చి సెలవు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి వైద్యుడు గులాబ్ రాజ్‌కుమార్‌తో రాష్ట్ర నాయకులు చర్చలు జరిపారు. వైద్యుడు ఆశా వర్కర్లకు బహిరంగంగా క్షమాపణ చెప్పడంతో పాటు ఇక నుంచి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆశా కార్యకర్తలు నిరసన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పాలకోడేరు: బైక్‌పై వెళుతుండగా కారు ఢీకొనడంతో ముగ్గురు యువకులు గాయపడ్డారు. భీమవరం 29వ వార్డుకు చెందిన యర్రా రమేష్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి సోమవారం బైక్‌పై అత్తిలి వెళ్లి తిరిగి వస్తుండగా కుముదవల్లి రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్‌కు తీవ్రగాయాలు కాగా, మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి. భీమవరం ప్రభుత్వాసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు.

మొగల్తూరు మండలంలో మరో ముగ్గురు

మొగల్తూరు: మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ఐ ఎం.వీరబాబు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోమటితిప్ప గ్రామానికి చెందిన జక్కంశెట్టి త్రిమూర్తులు, భార్య జయలక్ష్మి కొత్తట నుంచి స్వగామం కోమటితిప్ప వెళుతున్నారు. అదే సమయంలో బియ్యపుతిప్పకు చెందిన తిరుమాని నాగరాజు నడుపుతున్న వాహనం కొత్తోట సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలు కావడంతో నరసాపురం ఆసుపత్రికి తరలించారు. త్రిమూర్తులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు తెలిపారు.

గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మూర్తి

జంగారెడ్డిగూడెం : గౌడ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా మానవత మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గౌడ కమ్యూనిటీ హాల్‌లో గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చలమాల అశోక్ గౌడ్, ఇతర రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా అయినాల వెంకట రమణ మూర్తి (మానవత మూర్తి), ఉపాధ్యక్షుడిగా బొమ్మగాని బాలకృష్ణ, కార్యదర్శిగా వేముల సాయిబాబు ఏగ్రీవంగా ఎన్నికైనట్లు చలమాల అశోక్‌గౌడ్ తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.



క్లుప్తంగా

ఇంటి స్థలం కోసం స్పందనలో అర్జీ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి స్థలం మంజూరు చేయాలంటూ దండగర్ర నుంచి అర్జీ అందిందని ఎంపీడీవో ఎం.వెంకటేష్ తెలిపారు. తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత సమాజ సేవల్లో పాల్గొనాలి

తాడేపల్లిగూడెం: విద్యార్థి దశ నుంచి యువత దేశ భక్తి కలిగి, సమాజ సేవల్లో భాగస్వాములవ్వాలని ఉండాలని వశిష్ట లియో క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాతీయ మహిళా దినోత్సవంలో క్లబ్ అధ్యక్షురాలు మాధురి అన్నారు. క్లబ్ ద్వారా విద్యార్థినులకు ఆహార పొట్లాలు అందించారు. పేరిచర్ల ఫౌండేషన్ సహకారంతో క్యాన్సర్ రహిత శానిటరీ న్యాప్‌కిన్స్ అందజేశారు. లియో సభ్యులు ప్రమీల, అంబికా, సాయిశృతి, అమృత, రెడ్డి నందిని తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రాజకీయ అంశాలపై శిక్షణ



ఐద్వా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పోగాక పూర్ణ

తాడేపల్లిగూడెం: మహిళలు రాజకీయంగా చైతన్యవంతం కావాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పోగాక పూర్ణ పిలుపు నిచ్చారు. సోమవారం తాడేపల్లిగూడెంలో నిర్వహించిన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25,26 తేదీల్లో మహిళలను రాజకీయంగా చైతన్యపర్చడానికి తాడేపల్లిగూడెంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బంకుల యశోద, సీహెచ్.వరలక్ష్మి, అడ్డాల మీనాకుమారి, హేమలత పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవనాన్ని అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దైవసేవకులు

పెంటపాడు: విశ్వాసులకు దేవుని వాఖ్యాన్ని సులువుగా బోధించేందుకు దైవ సేవకులు కృషి చేయాలని యూపీఎఫ్ సంస్థ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు పేర్కొన్నారు. చింతపల్లి జెకర్యా ప్రార్థనా మందిరంలో సోమవారం సంఘ కాపరి మల్లిపూడి సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక జీవనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సంస్థ అధ్యక్ష, గౌరవ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు, బిషప్ ఐజక్ ముగ్గళ్ల తదితరులు బోధకులకు దేవుని వాక్యం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్





రాచర్ల, వల్లూరుపల్లిలో డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పెంటపాడు: జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంలో చేపట్టిన రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని, ఇది రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని వల్లూరుపల్లి ఎంపీటీసీ డి. అవతారం, రాచర్లకు చెందిన పార్టీ బీసీ సంఘ నాయకులు వాకా వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. జగనన్న భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా సోమవారం వల్లూరుపల్లి నుంచి రాచర్లలో రీ సర్వే చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రోన్ వినియోగాన్ని సోమవారం వారు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాచర్లలో ఆర్ నంబర్ 338లో 107 ఎకరాలు, వల్లూరుపల్లిలో 191 సర్వే నంబర్‌లో 107.82 ఎకరాల ప్రభుత్వ భూములను డ్రోన్ సర్వే చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూహక్కు పత్రాలను రైతులకు త్వరితగతిన ఇచ్చేందుకు ఈ సర్వేను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూరక్ష ఎంతో ఉపయోగమన్నారు. పెంటపాడు మండల సర్వేయర్ జ్యోతి మాట్లాడుతూ రీ సర్వే వల్ల పొలాలు కొనుక్కునేందుకు, అమ్ముకునేందుకు వీలవుతుందన్నారు. బ్యాంక్ రుణాలు పొందవచ్చన్నారు. బ్రిటీష్ కాలం నుంచి ఉన్న ఈ సమస్య వల్ల రైతులు ఇప్పటివరకు ఎంతో ఇబ్బందులు పడుతుండేవారన్నారు. ఆ ఇబ్బందులు నేటితో వైదొలగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామారావు, ఇరు గ్రామాల సర్పంచ్‌లు దంగేటి రామస్వామి, వాకా దుర్గాభవాని, రెవెన్యూ ఆర్ఐ కనకదుర్గ, వీఆర్వో సూర్యకుమారి వీఆర్వోలు, డ్రోన్ సిబ్బంది పాల్గొన్నారు.

మందులతో కుష్టు వ్యాధి నివారణ

తాడేపల్లిగూడెం రూరల్: శరీరంపై రాగి రంగు మచ్చలు ఏర్పడి వాటికి స్పర్శ లేకపోవడం వంటివి కుష్టు వ్యాధి లక్షణాలని, వాటిని గుర్తించిన వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని వెంకట్రామన్నగూడెం డాక్టర్ శ్రవణ్‌కుమార్, శ్రీహర్ష అన్నారు. కుష్టు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఆరు నెలల పాటు మందులు వాడితే కుష్టు వ్యాధిని నివారించవచ్చన్నారు. అనంతరం గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు టీవీ.సత్యనారాయణ, ఎస్‌టీఎస్ గిరి, డీపీఎంవో శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కుష్టువ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తణుకు టౌన్: స్పర్శలేని, మెరిసే మచ్చలను ప్రారంభంలోనే గుర్తించి తగిన వైద్య సహాయం అందిస్తే కుష్టువ్యాధిని పూర్తిగా నివారించవచ్చని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సీహెచ్ త్రిమూర్తులు తెలిపారు. జాతీయ కుష్టువ్యాధి నివారణ పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ వద్ద నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు. ఈ వ్యాధి నివారణకు తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ లెప్రసీ నోడల్ ఆఫీసర్ ఎంపీ వెంకట్రావు, హెల్త్ సూపర్ వైజర్ దుర్గాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి



పెంటపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



డ్రైడే కార్యక్రమంలో భాగంగా నిల్వ ఉంచిన నీటిని పారబోస్తున్న దృశ్యం

పెంటపాడు: దోమల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ర్యాలీలు నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణపై గృహిణులకు అవగాహన కల్పించారు. పరిమెళ్ల, యానాలపల్లి, కె. పెంటపాడులో ఫీవర్ సర్వే చేసారు. నీటిని వృథా చేయకుండా, మురుగు నీరు లేకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలన్నారు. కాంతారావు, సాయిబాబా, పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తుగా పురుగు మందుల పిచికారీతో పంటకు నష్టం

తాడేపల్లిగూడెం రూరల్: మొక్కజొన్నపై కత్తెర పురుగు ఉధృతి తక్కువగా ఉందని, ముందస్తుగా రైతులు ఎటువంటి పురుగు మందులు పిచికారీ చేయొద్దని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని వెంకట్రామన్నగూడెంలో మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్, ప్రాపినోపాస్‌ను కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు ఈ నెల 20లోపు ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈ విషయంలో రైతులు అశ్రద్ధ చేయవద్దని అన్నారు. ఆరుగొలను, కొత్తూరు ఆర్‌బీకేల్లో రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో ఇన్‌చార్జిలను నియమించామని, వారితో ఈ-కేవైసీ చేయిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఉద్యాన శాఖ సహాయకురాలు ఎస్.లోకేశ్వరి, వ్యవసాయ విస్తరణాధికారి మాధవ వర్మ ఉన్నారు.



వెంకట్రామన్నగూడెంలో మొక్కజొన్న తోటను పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

నేటి నుంచి రక్షణ సువార్త ఉజ్జీవ మహా సభలు

అత్తిలి: అత్తిలి పేరిష్ 18వ వార్షిక రక్షణ సువార్త ఉజ్జీవ మహాసభలు ఈనెల 14 నుంచి మూడు రోజుల పాటు మండలంలో కొమ్మర పెద్దపేట ఎఫిఫానియా లూథరన్ దేవాలయంలో జరగనున్నాయని గురుమండల అధ్యక్షుడు జె డేవిడ్‌రాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు సభ ప్రారంభమౌతుందని చెప్పారు. ఈసభలకు వాక్యోపదేశకులుగా ఆంద్రూ గ్రేస్‌రాజు, పి జేమ్స్, కె జాన్‌మాంగాచార్యులు, కె సజరేష్ వ్యవహరిస్తారని తెలిపారు. రక్షణ సువార్త ఉజ్జీవ మహసభలకు విశ్వాసులు హాజరుకావాలని ఆయన కోరారు.

క్రికెట్ పోటీల్లో బీకాం జట్టు విజేత



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రికెట్ పోటీల్లో విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: పట్టణంలోని చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో కళాశాల బీకాం జట్టు విజేతగా నిలిచినట్లు కళాశాల పీడీ కె వెంకన్న బాబు తెలిపారు. సోమవారం కళాశాలలోని వివిధ గ్రూపులకు సంబంధించి జరిగిన క్రికెట్ టోర్నమెంట్లలో మొత్తం 7 జట్లు పాల్గొనగా అందులో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం, బీకాం తృతీయ సంవత్సరం జట్లు ఫైనల్ మ్యాచ్‌కు చేరగా వారిలో బీకాం జట్టు విజేతగా, బీఎస్సీ జట్టు రన్నర్‌గా నిలిచినట్లు తెలిపారు. విజేత జట్టుకు ట్రోఫీని అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఇతర అధ్యాపక సిబ్బంది విజేతలకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

స్పందనలో నాలుగు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందనలో నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్.శ్రీకర్ సోమవారం చెప్పారు. మండలంలోని చినమిల్లిపాడు గ్రామానికి చెందిన విప్పర్తి సుబ్బారావు, కాళింగగూడెం నివాసి సనపల సూర్యనారాయణ 2016-17లో ఇంటి నిర్మాణానికి దస్తావేజులు ఇచ్చి రుణం తీసుకుని సొమ్ము చెల్లించగా, దస్తావేసులు తిరిగి ఇవ్వలేదని, వాటిని ఇప్పించాలని కోరారన్నారు. దుంపగడప గ్రామానికి చెందిన పిన్నమరాజు వెంకట రవివర్మ, పిన్నమరాజు రంగరాజు వేర్వేరు ఫిర్యాదుల్లో తమకు చెందిన భూమిని వెబ్‌ల్యాండ్ అడంగళ్‌లో సక్రమంగా నమోదు చేయలేదని ఫిర్యాదు చేశారన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించాలి

నరసాపురం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం చైర్‌పర్సన్ పట్టణంలోని 30వ వార్డు స్టేషన్‌పేట ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాల బోధన, తరగతి గదుల్లో సౌకర్యాలు, మధ్యాహ్న భోజనంలో మెనూ అమలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో వండిన ఆహార పదార్థాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ పథకం నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



ఏఐటీయూసీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం: కార్మికుల సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారమవుతాయని పలువురు నాయకులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక తాపీ, వడ్రంగి, సెంట్రింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి అధ్యక్షుడు పడాల శ్రీనివాసు ఆధ్వర్యం వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో కొనసాగుతున్న భవన నిర్మాణ కార్మికులకు కనీస వేతనాలు, పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్య పరిరక్షణ, పనిచేయలేని వృద్ధ కార్మికులకు పింఛన్ కోసం యూనియన్ పోరాడుతోందన్నారు. జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు మాట్లాడుతూ నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల వల్ల నిర్మాణ రంగం తీవ్రంగా దెబ్బతిందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, అంకం భాస్కరావు, మెండెం జేమ్స్, రాజా వెంకటరావు పాల్గొన్నారు.

భగవద్గీత జ్ఞానంతో కర్మవిధానం తెలుసుకోవాలి



అత్తిలి మండలం బల్లిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న హిందూజ్ఞాన వేదిక సభ్యులు

అత్తిలి: భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథాల ధర్మ ప్రచార కార్యక్రమం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో సోమవారం నిర్వహించారు. దేవుడిని పూజించడమే కాకుండా ఆయన అందించిన భగవద్గీత జ్ఞానం ద్వారా కర్మవిధానం తెలుసుకుని, యోగం ఆచరించి మోక్షం పొంది ఈజనన మరణ చక్రం నుంచి బయటపడాలని హిందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ చెప్పారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలు చదివి స్వామివారి ప్రసంగాలు విని ఆత్మజ్ఞానాన్ని తెలుసుకుని ప్రజలందరూ జ్ఞానులుగా మారాలనే ఉద్దేశ్యంతో త్రైత సిద్ధాంత వేదిక -ప్రబోధసేవా సమితి ద్వారా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ప్రజలకు అందజేసారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ, రామకృష్ణ, సత్యనారాయణ, హనుమంతరావు, రమేష్, నాగేశ్వరరావు, తారకేశ్వరి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

మండపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం



మండపాక ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించినట్లు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బంగారు రవి చెప్పారు. సోమవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని యల్లారమ్మ గుడి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో మంచం మీద నుంచి లేవలేని వారికి ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ వీ రాణి, ఎంపీహెచ్ఎస్ జయరాజు, ఎంపీహెచ్ఏ వైటీ మూర్తి, సుధా, అనురాధ, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థినులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

పెంటపాడు: బాలికలల్లో రక్తహీనత లేకుండా చూసుకోవాలని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు చేశారు. పెంటపాడు ఆరోగ్యశాఖ సిబ్బంది ఈ పరీక్షలు చేసి రక్తహీనత లోపం ఉన్నవారిని గుర్తించి మందులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మాచారి, గణిత అధ్యాపకులు ఆర్కే ఫణిధర్, ఎన్ఎస్ఎస్ అధికారి విజయబాబు, లెఫ్టినెంట్ ప్రేమ్‌సాగర్, డాక్టర్ గంధం వాణి కుమారి జాన్‌బాబు, పాల్గొన్నారు.